# ఇతివృత్తం

ముందుగదిలోకివచ్చి కిటికీలోంచి బయటకుచూస్తే చాలు కనబడుతుంది ఎదురుగా వీధిలోవున్న కొళాయి. వద్దనుకున్నా ఆ పంపు నాకళ్ళబడుతూంటుంది రోజూ.

ఆవీధికంతటికీ, బహుశ చుట్టుప్రక్కల నాలుగయిదు వీధుల కంతటికీ అదొక్కటే పంపు. ఆవీధి చివర దాదాపు పాతిక గుడిసెలదాకా వున్నాయి. ఆ గుడిసెలలో నివసించే వాళ్ళకి నీళ్ళు ఆ పంపుద్వారానే లభ్యమయ్యేది.

రోజుకి రెండుసార్లుమాత్రమే వస్తాయి ఆ పంపులో నీళ్ళు. అర్థరాత్రి రెండునుంచి ముడుదాకా, తర్వాత ఉదయం ఏడునుంచి ఎనిమిదిదాకా అంతే. నీటియెద్దడివల్ల ఆ రెండుగంటలు మించి రోజుమొత్తానికి మళ్ళీ ఎప్పుడు రావు. నీళ్ళు.

నీళ్ళు రానంతవరకు చాలా ప్రశాంతంగా వుంటుంది

పంపుదగ్గర. నీళ్ళు రావడానికి అరగంట ముందునుంచే పంపు దగ్గర వరసగా పెడతారు మట్టికుండలు, పాత్రలు ఒకొక్కసారి రాళ్లు, క్యూ ఏర్పరుస్తూ.

నీళ్లు రావటం మొదలయినదగ్గరనుంచి వాతావరణమే మారిపోతుంది. గోలగావుంటుంది. ఎక్కువగా నీళ్లుపట్టుకోవడానికి వచ్చేది ఆడవాళ్ళుకాబట్టి, ప్రశాంతత భగ్నమయిపోతుంది. క్యూ చెదిరిపోతుంది.

నీళ్లువచ్చే ఆ గంటసేపు చిన్న కురుక్షేత్రంలాంటిది జరుగుతుంది. కొళాయిదగ్గర ఆడవాళ్లు సాధారణంగా ఒకళ్ళతో ఒకళ్లు పోట్లాడకుండా వుండలేరనుకుంటాను. ముఖ్యంగా గంటసేపే నీరువచ్చే వీధికుళాయయితే మరీను.

ఒకళ్ళని ఒకరు తిట్టుకుంటారు. కొందరు అలవాటు పడ్డవాళ్ళయితే జుట్లుకూడా పట్టుకుంటారు. మట్టికుండలు పగలుకొట్టుకుంటారు పగలకొడతారు సఖ్యతగా అక్కడి దాకావచ్చినా, నీరురాగానే తొక్కిడి మొదలయి బూతులు తిట్టుకుంటారు.

అందరికీ తొందరే. అందరికీ మిగతావాళ్ళ కుండల కన్నా తమవే ముందర నిండాలన్న ఆత్రుత. తనుదాకా నీరు రావేమోనన్న భయం నీరురావటం ఆగిపోయ్యేలోపల తమకి నీరు పట్టుకు అవకాశం రాదేమోననే బెంగ. నీరు దొరకకపోతే ఆరోజు యమయాతనపడాలి

కొత్తల్లో ఆగొడవకి, దెబ్బలాటలకి విసుగు వచ్చేది.

అసలా పంపు ఇ టిముందునుంచి పీకించేస్తే బాగుణ్ణు అనిపించేది. అర్ధరాత్రి నిద్ర చెడిపోయేది వాళ్ళగొడవకి.

నాలుగయిదు నెలలు దాటడంవల్ల క్రమంగా అలవాటు పడిపోయాను. నోట్లో వేపపుల్ల పెట్టుకుని, కిటికీదగ్గర నిలబడి ఓ పావుగంటసేపయినా ఆ నీరుకోసం పోట్లాడుకునే వాళ్ళవంక చూడటం దినచర్యలో ఓ భాగం అయిపోయింది నాకు ఇప్పుడు.

ఒకొక్కసారి ఆ పంపుదగ్గర రేగిన కొట్లాటలు చిలికి చిలికి గాలివానయి మొగవాళ్ళదాకా వెళ్ళేవి. అలాంటప్పుడు మొగవారుకూడా రోడ్డుమీదకివచ్చి పోట్లాడుకునే వారు అప్పుడప్పుడు. ఎదురింటాయన సాధారణంగా అంత దూరం రాకుండా సర్ది చెప్తూంటాడు అందరికీ. ఆయనంటే వాళ్ళకి కొద్దిగా గౌరవంకాబట్టి వింటారు ఆయనమాట.

మామయ్యా వాళ్ళకీనీరుకావాలి ఒక్కటే కుళాయి వుందికదా. పోనీ ఈ వీధిలోని అందరిఇళ్ళలో వున్న కుళాయిలలో వాళ్ళని నీరుపట్టుకోనిస్తే ఏం?

నా వెనక చేరిన ఆరేళ్ళ బాబు అడిగాడు.

"దాన్ని సోషలిజం అంటారు. కుదరదు ఇక్కడ" సమాధానం చెప్పాను.

"వాళ్ళే బలవంతంగా అందరిళ్ళలోకి వెళ్ళి నీరు పట్టుకుంటే ఏం" అడిగాడు బాబు వెంటనే నన్ను.

"అది కమ్యూనిజం అవుతుంది. ఇంకా అంత ఎదగ లేదు మనవారు."

కొంచెంసేపాగి అన్నాడు ఆలోచించి "పోనీ ఎవరయినా అక్కడ దగ్గరనిలబడి ఒకళ్ళతర్వాత ఒకళ్ళకి నీరు అందేలాచూస్తే? అప్పుడు ఎక్కువ, తక్కువలేకుండా సమానంగా అందరికీ నీరు అందుతాయిగా?"

"అదే డిక్టేటర్‌షిప్ ఒకవిధంగా, అందరూ తనమాట వినేలా భయపెట్టి చెప్తేగాని లొంగరు ఎవరూ."

"ఏమిటి ఇంగ్లీషులో చెప్తున్నావు మామయ్యా. నాకేం అర్థంకావటంలేదు" అన్నాడు బాబు.

నవ్వి వాడి తల నిమిరాను ఆప్యాయంగా.

"అయితే ఇప్పుడు వారున్న వ్యవస్థ ఎలాంటిది?"

అంతవరకు మా మాటలువింటున్న బాబు నాన్న అడిగాడు నన్ను నవ్వుతూ.

"కేపిటలిజం"

"ఎలా?"

"బలంవున్నవాడికి నీరు దొరుకుతున్నాయిగా."

"రౌడీయిజం అవుతుంది అది"

"కేపిటలిజం అంటే మరేమిటి? బలంబదులు డబ్బు నీళ్ళబదులు సౌఖ్యం అంతే తేడా."

"ఈ పంపుమీద ఓ కథ రాయకూడదూ?" అడిగాడు బాబు నన్ను ఒకరోజు.

"కథా?"

"అవును. మీరు కథలురాస్తారుగా. వాళ్ళందరి మీదా, ఆ కొళాయిమీదా ఓ కథ రాయండి."

చిన్నగా నవ్వాను బాబు మాటలకి.

"అవును. మంచికథ అల్లచ్చుగా" అన్నారు బాబు తండ్రి ఉత్సాహంగా.

"తప్పకుండా. మంచిసంఘటన బుర్రకి తడితే అలాగే రాస్తాను."

"కోకొల్లలు జరిగాయి మేం ఈ ఇంటికివచ్చిన రెండేళ్ళలో. ఒకటి చెబితే ఆశ్చర్యపోతారు మీరు."

"ఎప్పుడు?" అడిగాను కుతూహలంగా.

"నాలుగయిదుసంవత్సరాల క్రితం"

"అప్పుడుకూడా పంపుస్థితి ఇలానేవుందా?"

"అవును. ఈవీధిచివర ఇద్దరు రౌడీలు ఉండేవాళ్ళు. నీళ్ళదగ్గర దెబ్బలాటవచ్చింది ఆ ఇద్దరికీ. కొట్టుకున్నారు. వాళ్ళభయంతో రెండురోజులు మళ్ళీ పంపుచాయలకయినా ఎవరూ వెళ్ళలేదు. మూడోరోజు ఓరౌడీ భార్య నీళ్ళకోసం వచ్చింది. అయిదు ముఠాల్లో కర్రలతో వచ్చారుపదిమంది. ఆ కొట్టుకోవడంలో ఒకడితల చితికిపోయింది బాగా."

"చచ్చిపోయాడా?" అడిగాను

"అక్కడికి కక్కడే. అయినా పంపు బాగుపడలేదు. అలాగే వుండిపోయింది"

"తర్వాత? వివరంగా చెప్పండి" అడిగాను కొంచెం ఉత్సాహంగా.

* * *

నా గదిలో అద్దంముందు నించుని నెరసినజుట్టు దువ్వుకుంటుంటే వచ్చాడు బాబు గదిలోకి

"మామయ్యా! ముసలాడయినా ఇంకా ఎందుకు పెళ్ళి చేసుకోలేదు నువ్వు?" అడిగాడు.

"ఇంకా నువ్వు అడగలేదని" నవ్వాను.

"చెప్పు మామయ్యా!"

"ఊరికెనే"

"నువ్వు పెళ్ళి చేసుకొంటే ఎంత బాగుండేదో. డబ్బిచ్చి మా యింట్లో వుండే బదులు ఎంచక్కా మీ యింట్లో వుండేవారు".

"నీకు తెలియదు బాబు. నేను ఏభై సంవత్సరాలు వచ్చినా యిలా బ్రహ్మచారిలా వుండిపోవడానికి యెంత కష్టపడ్డానో" అన్నాను కొంచెం గర్వంగా.

నే నిచ్చిన క్రీమ్ బిస్కెట్ అందుకొని వెళ్ళిపోయాడు బాబు. రోజూ ఉదయం బిస్కెట్ యిస్తాను బాబుకి. అలవాటయింది. నేను పేయింగ్ గెస్టుగా వాళ్ళింట్లో చేరిన వారం రోజుల నుంచి.

ఎప్పుడూ ఎత్తని సంగతి, నా పెళ్ళి గురించి బాబు అడగటం ఆశ్చర్యం వేసింది నాకు. బహుశ యింట్లో పెద్దవాళ్ళిద్దరూ నా పరోక్షంలో అనుకుంటూండగా విని వుంటాడు.

కాఫీ తాగి కాగితాలు పుచ్చుకుని కూర్చున్నాను కథ రాయడానికి. డక్టర్ యిచ్చిన మందుబిళ్లలు వేసుకుని.

కాగితం మీద ముందర స్కెచ్‌లా వ్రాసుకొన్నాను పాత్రల పేర్లు, సన్నివేశాలు, వాటి వరస.

ఆ వీధికంతా ఒకటే పంపు. ఆ చుట్టూ నేను చూసిన మనుష్యులనే అల్లాను కథలో. క్లైమాక్స్‌లో ఆ పంపుదగ్గర హత్యజరుగుతుంది పంపువల్ల వచ్చినపోట్లాటలో. పంపుదగ్గరే పడిపోతాడు వాడు. వాడి తలమీద నుంచి కారే రక్తం, ఆ పంపులోంచి పడే నీటి ధారా కలిసి ప్రవహిస్తాయి కాలువ లోకి. మర్నాడు మున్సిపాలిటీవారు దాన్ని పీకేస్తారు

నాలు గయిదుగంటలు కష్టపడ్డ తర్వాత పూర్తి చేసి, ఫేర్ చేశాను. 'వీ ధి పం పు' అనే పేరుపెట్టి పంపాను ఓ పత్రికకి. నా హోస్ట్ ఆ కథచదివి మెచ్చుకున్నాడుకూడా.

ఆ కథని ప్రచురిస్తున్నామని వుత్తరం వ్రాశారు పత్రిక వారు నెల తిరక్కుండానే. మరో రెండు నెలల్లో ప్రచురించారు కూడా.

*        *        *

'వీధిపంపు' అన్న నా కథ ప్రచురింపబడ్డ పదిరోజుల తర్వాత ఓ ఉత్తరం వచ్చింది నాకు. ఆ కవరు రంగునిబట్టి కవరుమీద ఇంగ్లీషులో నీట్‌గా వున్న నా అడ్రసు పట్టి, కవరుమీది ఫ్రాంకింగ్ మెషిన్ ముద్రనిబట్టి చూడగానే గ్రహించాను అది నాకథ వేసుకొన్న పత్రికనుంచివచ్చిందని.

కవరు చింపి ఉత్తరం తీసి చదివాను. ఇంగ్లీష్‌లో వుంది ఉత్తరం.

డియర్ సర్ !

మేము ప్రచురించిన మీ 'వీధిపంపు' కాపీకథ అని తెలియజేయడానికి విచారిస్తున్నాం. ఆకథను 'నీళ్ళు' అనే పేరుతో నాలుగు సంవత్సరాల క్రితం 'శిల్పి' అనే అతను వ్రాశాడు. మరో పత్రికలో ప్రచురింపబడ్డ సంగతి ఆ అసలు రచయిత మాకు తెలియజేశారు. ఆయన మాకు వ్రాసిన ఉత్తరం జతపరుస్తున్నాం. మంచి రచయితగా మీమీద వున్న గౌరవాన్ని ఈ సంఘటన కృంగదీసింది. యీ అభియోగానికి మీ సంజాయిషీ కోసం ఎదురు చూస్తున్నాం.

— ఎడిటర్.

ఉత్తరం పూర్తిగా చదవగానే కండ్లు తిరిగినట్లయింది నాకు. ఆ ఉత్తరానికి జతచేయబడ్డ వుత్తరం చదివాను వెంటనే, తడబాటులో.

డియర్ సర్,

కంగ్రాచ్యులేషన్స్.

నేను రాసిన కథని చదివి, అంత వున్నతంగా, చాలా కొద్ది మార్పులతో అదే పాత్రలతో, అదే ముగింపుతో ఓ కథ రాసి, మరో పేరుపెట్టి, ఆ కాపీ కథను మరో పత్రికకు పంపిన మీ ధైర్యానికి, చాతుర్యానికీ కంగ్రాచ్యులేషన్స్. యీ నాలుగు సంవత్సరాల వెడం మీ తప్పుని జయట

పడనీయదనుకుంటారు బహుశ. కనీసం కథ చివర ఫలానా కథ చదివాక ఈ కథ రాశానని పేర్కొన్నా సంతోషించే వాడిని. అదీ లేదు.

ఇంతకాలం మిమ్మల్నొక మంచి రచయితగా గుర్తించి మీ కథలు ఆసక్తిగా చదివేవాడిని. వాటిలో ఎన్ని మీ స్వంత రచనలో దేముడికి తెలియాలి. ముప్ఫై సంవత్సరాల నుండి వ్రాస్తున్న మీరు ఇప్పటిదాకా పట్టుబడకపోవడం మీ 'చౌర్యలాఘువాన్ని' చాటుతోంది.

మీకు, కథలకి ఇతివృత్తాలు అంత కరువయితే అసలు కథలు వ్రాయడం మానేయటం మంచిది. లేదా నా లాంటి వాళ్ళని అర్థిస్తే తప్పకుండా సంతోషంగా దానం చేసి వుండేవాళ్ళం.

మీరు వారం రోజుల లోపల నా ఉత్తరానికి సమాధానం సరయినది ఇవ్వలేకపోతే చట్టరీత్యా మీమీద చర్య తీసుకోవాలనుకుంటున్నాను.

— శిల్పి.
(అసలు రచయిత)

ఉత్తరం పూర్తిగా చదవగానే తల గిర్రున తిరిగినట్లయింది నాకు. ఒళ్ళంతా వణుకు బయలుదేరింది కొద్దిగా.

శిల్పి రాసిన ఆ రెండో వుత్తరంలోని కొన్ని మాటలు

‘చౌర్యాలాపనం, అర్థించడం, దానం, చర్య’ లాటివి. నా సెంటిమెంటుకి సూటిగా తగిలాయి, బాగాలోతుగా.

ఆ పత్రిక ఎడిటర్, శిగ్ని కలిసి నన్ను ఆ చెంపా, ఈ చెంపా వాయిస్తుంటే నా కథ చదివిన పాఠకులంతా నన్ను చూసి విరగబడి నవ్వినట్లుగా ఫీలయ్యాను.

రచయితగా నాలో ఏర్పడి, పెరిగిన నా వ్యక్తిత్వం పూర్తిగా దెబ్బతింది. మంచంమీదకి వాలిపోయాను కూర్చోలేక.

గుండెల్లో దడ. కళ్ళుమూసుకున్నాను కళ్లుమూసుకున్నా - నేనున్నగదీ, మంచం తిరుగుతున్నట్లుగానే అనిపించింది.

బ్లడ్ ప్రెషర్ పెరిగింది నాకు అకస్మాత్తుగా!

పావుగంట తర్వాత డాక్టర్ వచ్చాడు. నా పల్స్ చూసి. బి. పి. చెక్ చేసి ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. కాస్త తేరుకున్నాను. బాబుతల్లి అందించిన కాఫీ తాగాక.

“ఏం జరిగింది?” అడిగింది బాబుతల్లి ఆత్రంగా.

జరిగింది చెప్పాను.

“ఈ వయసులో మీకు ఏం జరిగినా తట్టుకోవడం కష్టం” అన్నాడు డాక్టర్ నవ్వి.

“నేను కథలు వ్రాయడం మొదలయిన దగ్గరనుంచి ఇంతవరకు ఎప్పుడూ నామీద ఇలాంటి నింద రాలేదు.” అన్నాను నేను బాధగా

"అసలు మీరు కథలు వ్రాయడం మానేస్తే మంచిది. ఎప్పటినుంచో చెపుతున్నాను ఇక వ్రాయడం ఆపేయమని ఇంకోసారి బ్లడ్ ప్రెషర్ వస్తే ఎలావుంటుందో చెప్పలేను. ఈ సారి కొంచెం అలస్యంగా వస్తే, మీకు ఇంజక్షన్ ఇవ్వక పోతే..."

సీరియస్ నెస్ తో పాటు హెచ్చరిక ధ్వనించింది డాక్టర్ కంఠంలో.

"మరి బ్రతికే దెలా!" అన్నాను తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

ఆ రాత్రి బాబుతండ్రి నాతో అన్నాడు వుత్తరాలు రెండూ చదివి, "చాలా విచిత్రం కదూ!"

"అవును. విచిత్రమే. ఆ కథ 'నీళ్ళు' చదవలేదు. చదివిన గుర్తే లేదు నాకు. కేవలం కాకతాళీయంగా మా ఇద్దరికీ ఒకే ప్లాట్ తట్టింది. ఒకేవిధంగా వ్రాయడంజరిగింది."

"మీరు కాపీకొట్టలేదన్న సంగతి నాకు తెలుసు బాగా రూఢిగా."

"వాళ్ళకి తెలియాలిగా" అన్నాను.

"వెంటనే ఏదయినా సమాధానం వ్రాయండి!"

"అలాగే" అన్నాను చిన్నగా నిట్టూర్చి.

"మీరు ఆ కథ 'నీళ్ళు' చదివి చెప్పలేదగా నాకు!" అడిగాను అనుమానంగా హాస్యాని.

"నాలుగు సంవత్సరాల క్రితం నేను పత్రిక చదవలేదు. చదివినా గుర్తుండదు ఇంతకాలం" అన్నాడు బాబుతండ్రి.

ఉత్తరం రాశాను మర్నాడు శిల్పికి.

డియర్ మిస్టర్ శిల్పి,

మీ ఉత్తరం ఆశ్చర్యం, ఆవేదనా కలిగించాయి. మీకథ 'నీళ్లు' చదవలేదు నా జీవితంలో ఇంతదాకా. ఇద్దరం ఒకే ఇతివృత్తాన్ని ఒకేవిధంగా వ్రాయడం జరిగింది. కేవలం కాకతాళీయంగా మీరుముందూ, నేను వెనుకా వ్రాయడం నా దురదృష్టం. ఇందుకు మనస్సాక్షి తప్ప వేరే సాక్ష్యం లేదు.

నేనుంటున్న ఇంటిముందున్న వీధిపంపును చూసి ఆ కథ వ్రాయడం జరిగింది. మీ కథని చెప్పబడే నా కథ 'వీధిపంపు' కి పారితోషికంగా వచ్చిన చెక్‌ని మీ పేర ఎండార్స్ చేసి పంపుతున్నాను."

అంతకంటె ఏం వ్రాయాలో తోచలేదు. ఆ వుత్తరం కాపీనే పత్రికవాళ్ళకి కూడా పోస్ట్ చేశాను నేను.

రెండురోజుల తర్వాతవచ్చినపత్రికలో ప్రచురించారు, ఫలానా వారు వ్రాసినకథ 'వీధిపంపు', 'నీళ్లు' అనే కథకి కాపీ అని. ఇంకెప్పుడూ అలాంటి కాపీరచనలు ప్రచురింపబోమని జరిగినదానికి చింతిస్తున్నామని.

ప్చ్! పాఠకులందరికీ తెలిసిపోయింది ఈ సంగతి. ఎంత తలవంపు నాకు పాఠకులలో, తోటి రచయితలలో.

* * *

ఆ పత్రిక విడుదలయిన ఆరో రోజు బాత్ రూంలో నా కట్టుడుపళ్లు శుభ్రపరుచుకుంటుంటే బాబు పరుగెత్తుకుని వచ్చి అందించాడో కవరు

చేతులు టవలుతో తుడుచుకుని, కళ్ళజోడు వెతికి పెట్టుకుని ఆ కవరు చింపి, ఉత్తరం బయటకి తీశాను.

శిల్పినుంచి వచ్చిందా వుత్తరం. గబగబా చదవడం ప్రారంభించాను.

డియర్ సర్,

మీరు వ్రాసిన ఉత్తరం పూర్తిగా చదవకుండానే, లెటర్ హెడ్ మీది మీ చిరునామా చూడగానే జరిగింది కొంత అర్థం అయిందినాకు. మీ 'వీధిపంపు' కథ ఇతివృత్తం మీ స్వంతమేనని, కాపీ కాదని ఒప్పుకుంటూ తొందరపడి నందుకు క్షమాపణ కోరుకుంటున్నాను మిమ్మల్ని. అది మీ స్వంతరచనేనని పత్రిక వాళ్ళకి తెలియచేసి, నా అభియోగం ఉపసంహరించుకుంటున్నాను.

రచయిత తన పరిసరాలలోంచి కథలకి ఇతివృత్తాలు గ్రహించడం అనాదిగా వస్తున్నది ప్రస్తుతం మీరుంటున్న ఇంట్లో నేను అయిదుసంవత్సరాలక్రితం ఉండకపోతే అసలా కథ నేనూ వ్రాసివుండేవాణ్ణి కాదు. ఈ గొడవకూడా జరిగి వుండేది కాదు.

జరిగినదానికి చింతిస్తూ మీ చెక్ మాకు త్రిప్పి పంపిస్తున్నాను.

క్షమాపణలతో,

—శిల్పి.

పోస్ట్‌స్క్రిప్ట్; ఇంకా ఆ వీధిపంపు అలాగే బాగుపడకుండా వుండడం నాకు బాధాకరంగా వుంది.

ఆ ఉత్తరంలోని సంగతులు గ్రహించాక నాకు ఒక్కసారిగా ఎంతో సంతోషం వేసింది ఇంట్లో ఎవరూ లేరు సమయానికి. రాగానే అందరికీ చెప్పాలి నాతిప్పేమీ లేదని. బాబుకూడా ఆడుకోడానికి వెళ్ళిపోయాడు.

కొద్దిగా తూలాను. గది తిరుగుతున్నట్లుగా అనిపించింది. నిలబడలేక నేలమీదకి వాలిపోయాను.

సంతోషంతోపాటు నాకు బ్లడ్‌ప్రెషర్ కూడా క్రమక్రమంగా పెరిగిపోతోంది. గుండెల్లో దడ ఎక్కువవుతోంది.

—X—